# పసులగాసే మొనగాడా...

జగిత్యాల సిటీనానుకొని ధరూర్‌క్యాంపు ప్రక్కగా శ్రీరాంసాగర్ మెయిన్‌కెనాల్ నిశ్శబ్దంగా పారుతోంది. కాలువొడ్డున బర్రెల మందకి కాపలాకాస్తూ దున్నపోతు మీద కూచొని వూదుతున్న రంగడి పిల్లనగ్రోవికి మైమరచి సాగుతున్నట్టు... మన్నుతిన్న పాములా... అంతకు ముందే కొట్టుకుపోయిన ఆ శవం చెప్పిన కష్టం కథవిని... అలలు ముడుచుకుపోయి అంతర్మథనమై సాగుతోంది.

సూర్యకిరణాలకి తళతళా మెరుస్తూ కొత్త పెళ్ళి కూతురు ఒద్దికగా ఏడడుగులు వేస్తున్నట్టు... నెమ్మదిగా సాగుతోంది. హఠాత్తుగా చనిపోయిన ప్రముఖ రాజకీయ నాయకుడి శవయాత్రలా మూగగా సాగుతోంది.

రంగడి పిల్లన గ్రోవిలోని గానం గాలి అలల్లో కల్సిపోయి మధురాతి మధురంగా విన్పిస్తోంది. వాడు పిల్లనగ్రోవి వూదుతూనే పశువులు పంటచేలల్లో పడకుండా గమనిస్తున్నాడు. దున్నపోతు ఆగినప్పుడల్లా కుడికాల్తో దాన్ని తన్నగానే అది నత్తనడక నడుస్తోంది. ఏది ఏ రాగమో తెలీకపోయినా సినిమాపాటలన్నీ పిల్లనగ్రోవి ద్వారా వూదుతాడు వాడు. ఉగాది పండక్కి 'చిల్వకోడూర్'లో జరిగే జాతరకి ఇష్టపడి కొనుక్కున్నాడు దాన్ని. అదివాడి ఆరో ప్రాణం. కాలువలో ఈతకొట్టడం, ఆనక దున్నపోతు మీదెక్కి పశువుల్ని కాస్తూ పిల్లన గ్రోవి ఊదటం వాడి దినచర్య.

క్యాంప్ గెస్ట్‌హౌస్‌కి దగ్గరగా ఉన్న ఆ కాలువ గట్టుమీద రవికిరణ్, వినీత కాలువనే విచిత్రంగా చూస్తూ నడుస్తున్నారు. గెస్ట్‌హౌస్‌లో ఆఫీస్ ఇన్స్‌పెక్షన్ మీద సతీసమేతంగా దిగిన రోడ్స్ అండ్ బిల్డింగ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘునాథరెడ్డి పిల్లలు వాళ్ళు.

వినీతకైతే అంతపెద్ద కాలువ చూస్తుంటే భయంగాను, ఆనందంగాను ఉంది. రవికిరణ్ ఆలోచనలన్నీ వీటన్నిటి గురించి క్లాస్‌మేట్స్‌కి ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు.

'అన్నయ్యా' అటుచూడు అంది వినీత దున్నపోతు మీదున్న రంగడివైపు చూపిస్తూ 'భలే బాగా వూదుతున్నాడు కదూ' అన్నాడు రవికిరణ్. వాళ్ళని చూసి రంగడు పాట ఆపేసాడు. 'ఎందుకాపేసావ్ ? పాడు' అంది వినీత.

రంగడి ముఖం వెలిగిపోయింది. 'నా పాట బావుందా' అడిగాడు ఆశ్చర్యంగా 'ఓ...' అంది వినీత.

ఈ పాటకన్నా... నాకు నామది నిన్ను పిలిచింది... అన్నపాట బాగా పాడొచ్చు అన్నాడు. పాడమంటే వెంటనే పాడాలన్న ఆతృత వాడిలో.

"మరి ఆ దున్నపోతు ఎక్కావేంటి ?" అన్నాడు రవికిరణ్ వికారంగా. రంగడి ముఖం చప్పున చిన్నబోయింది. "ఏ...ఇది మాదే... రోజంతా నన్ను మోస్తుంది. ఎక్కితే తప్పేంది ?" అన్నాడు. దున్నపోతు మీద ముసురుకుంటున్న దోమలు వాణ్ణికూడా కుడుతుంటే బరబరా గోక్కుంటూ...

రవికిరణ్ అసహ్యంగా చూసాడు వాడివైపు. చొక్కాలేక, మురికి పట్టిన శరీరంతో తొడుక్కున్న నిక్కర్‌కి బటన్స్‌లేక జారిపోకుండా మొలదారాన్ని దానిపైకి దోపి, చింపిరి జుత్తుతో అనాగరికంగా...

'నీ పేరేంటి ?' అడిగింది వినీత.

'నా పేరు పసులగాసే రంగడు... మరి మీ పేర్లేంటి ?" అడిగాడు.

"ఐయామ్ రవికిరణ్; సెవెంత్‌క్లాస్ డాన్‌బాస్కో పబ్లిక్‌స్కూల్, హైదరాబాద్" దర్పంగా చెప్పాడు రవికిరణ్.

"నాపేరు వినీత, యుకేజీ. సెయింట్ ఆల్ఫోన్స్ స్కూల్" అంది వినీత. రంగడికి సరిగా అర్థం కాలేదు గాని పేర్లు మాత్రం తెలిసాయి.

"నువ్ చొక్కాలేస్కోవా ?" అడిగింది వినీత.

"ఏస్కుంటా... జాతరకెళ్ళినపుడు మా అయ్య కొనిస్తానన్నాడు" గర్వంగా చెప్పాడు

రంగడు.

"వినీ... వెళ్దాం పద... మమ్మీ మనకోసం వెయిట్ చేస్తుంది" అన్నాడు రవికిరణ్. వాడికి రోతగా ఉంది పశువుల మధ్య.

"అదేంటి... నామది నిన్ను పిలిచింది... పాట వినరా ?" బెంగగా అడిగాడు రంగడు.

" మా ఇంట్లో సి.డి.ప్లేయర్ వుంది. నీ పాట ఎవడిక్కావాలి ? వినీ పద..." తొందరచేశాడు రవికిరణ్.

"రేపొస్తాం లే... అప్పుడు వింటాం టాటా" అంది వినీత. మల్లెపువ్వులాంటి గౌనులో ఎర్రగా బొద్దుగా వున్న వినీత ఆ మాటనగానే రంగడు "సరే..." అన్నాడు.

అనాలోచితంగానే పిల్లనగ్రోవి వాడి పెదవుల్ని తాకింది, సుస్వరమైన రాగం వాళ్ళ చెవుల్ని తాకగానే ఓసారి తిరిగి చూసి వెళ్ళిపోయారు.

★ ★ ★

మర్నాడు... పశువుల్ని తోలుకొని రంగడు వచ్చేసరికి కెనాల్ ఒడ్డున ఓ చోట కట్టిన మెట్ల మీద కూచొని నీళ్లతో ఆడుకుంటున్నారు రవికిరణ్, వినీత.

"హాయ్...రంగడూ..." అంది వినీత

వాళ్ళని చూడగానే రంగడు చప్పున దున్నపోతు మీది నుండి దూకి వాళ్ళ దగ్గరకొచ్చాడు.

"ఏయ్...రంగా నీకు ఈతొచ్చా ?" అడిగాడు రవికిరణ్.

"ఓ బాగావచ్చు... ఇది అట్లాంటి ఇట్లాంటి కాలువగాదు. చూసింద్రా... ఏమీ ఎరగని నంగనాచిలా వెళ్తుందా ? చాలా లోతుంది. లోపల అదిగో... అక్కడ సుడిగుండాలు వున్నాయ్. అయినా నాకేం భయంలేదు. రోజూ ఇందులో రెండు గంటలు ఈతకొడతా సుడిగుండంలో గిరగిరా తిరిగి ఆ వొడ్డుకి వెళ్తాను తెల్సా ?" చకచకా చెప్పాడు రంగడు.

"అమ్మో... నాకైతే భయం" అంది వినీత.

"నాక్కూడా వచ్చు. స్విమ్మింగ్ పూల్‌లో నేర్చాను. అక్కడి నీళ్ళు ఫ్రెష్‌గా వుంటాయి' ' చెప్పాడు రవికిరణ్.

"మరి పాట పాడనా ?" అన్నాడు రంగడు ఓ మెట్టు మీద కూచుంటూ చొక్కాలేని వాడి కడుపు వుబ్బి వుంది. మెడలో ఆంజనేయుడి బొమ్మున్న వెండి తాయెత్తు తెల్లగా మెరుస్తోంది.

"వద్దులే" అన్నాడు నిరాసక్తంగా రవికిరణ్.

"పాడు" అంది వినీత. ఆ మాట వినగానే వాడు పిల్లన గ్రోవితో పాటందుకున్నాడు. అసహనంగా రవికిరణ్ లేచి వెళ్ళబోతుంటే రవికిరణ్ కాలిచెప్పు వూడిపోయి కాలువలో పడింది. అది గమనించిన వినీత "అన్నయ్యా చెప్పు" అని పట్టుకోబోయి జర్రున కాలువలోకి జారిపడింది.

రెప్పపాటులో వినీత ప్రవాహ వేగానికి మధ్యలోకి నీళ్ళు మింగుతూ పోయింది.

"విన్నీ"... అరిచాడు రవికిరణ్.

కళ్ళు మూసుకుని తన్మయంగా పాడుతున్న రంగడు అరుపుకి కళ్ళు తెరిచే సరికి వినీత మునిగిపోతూ కన్పించింది.

అంతే !

పిల్లనగ్రోవితో సహా వాడు కాలువలోకి దభిల్లున దూకాడు. చేపలా ఈదుకుంటూ వెళ్తున్నాడు.

రవికిరణ్ ఏడ్పు బిగ్గరవటంతో గెస్ట్‌హౌస్ వాచ్‌మెన్ పరిగెత్తుకొచ్చి కొట్టుకుపోతున్న వినీతను చూసి "అమ్మగారూ..." అంటూ మళ్ళీ గాబరాగా గెస్ట్‌హౌస్ వైపు పరిగెత్తాడు.

వినీత నీళ్ళ మధ్య అతలాకుతలం అవుతూ భయంగా అరవబోతూ మునిగిపోతూ వుంది.

నీటి వేగం ఉధృతమవుతోంది....

రంగడు వేగంగా ఈత కొట్టడానికి ప్రయత్నిస్తూనే వినీత సుడిగుండం వైపు కొట్టుకుపోవడాన్ని గమనించాడు.

వాడి చిన్నిగుండె లయతప్పింది. క్షణం సేపు నీళ్ళలోనే ఆగి... "కిరణ్‌బాబు... మీరు కొంచెం నీళ్ళలోకి దిగిరాండ్రి. నేను చెల్లిని విసిరేస్తాను... కొంచెం దిగిరాండ్రి...." అని అరిచాడు.

రవికిరణ్ ఏడుస్తూనే భయం భయంగా నీళ్ళలోకి దిగాడు. నీటివేగానికి పై ప్రాణం పైనే పోయింది.

"ఇంకొంచెం లోతుకురండి" వాడు మరోసారి అరిచాడు.

రవికిరణ్ గుండె చిక్కబట్టుకుని ఇంకొంత లోపలికి వెళ్ళాడు. అప్పటికే వినీత

సుడిగుండాన్ని చేరింది. రంగడు నీటి అడుక్కిపోయి సుడిగుండం దగ్గర పైకిలేచి బొంగరంలా తిరుగుతున్న వినీత చేయిపట్టుకుని అదే వేగంతో బలంగా విసిరాడు. పిల్లనగ్రోవి ఎప్పుడో నీళ్లలో జారిపోయింది.

వినీత నీళ్లలో కొంతదూరంలో ఎగిరొచ్చిపడింది. రవికిరణ్ గబుక్కున చెల్లి చేయి దొరకబుచ్చుకున్నాడు. రంగన్ని సుడిగుండం లాక్కొంది. కాసేపు అందులో గిరగిరా తిరిగి కాళ్ళతో ఎగదన్ని పైకొచ్చేసరికి కాలువొడ్డుకి చెల్లినెత్తుకుని రవికిరణ్ చేరుకొన్నాడు.

రంగడు 'హమ్మయ్య' అనుకొని తిరిగి చూసేసరికి దూరంగా కొట్టుకుపోతున్న పిల్లనగ్రోవి కన్పించింది 'హమ్మోనా పీక....' అనుకుంటూ దానివైపు ఈదుకుంటూ పోయాడు దూరంగా.

అప్పటికే వాళ్ళ మమ్మీ, డాడీ, వాచ్‌మెన్ మరికొందరు క్యాంపు ఉద్యోగులు అక్కడికి పరుగు పరుగున చేరుకున్నారు. వీనితకి నీళ్ళు కక్కిస్తున్నారు. కాని వాళ్ళెవరికీ రంగడు కన్పించలేదు.

ఇన్‌స్పెక్షన్ కొచ్చిన చీఫ్ ఇంజనీర్ గారి మెప్పుకోసం ఓ సీనియర్ అసిస్టెంట్ "కంగ్రాట్స్ సార్.. మీ అబ్బాయ్ నిజంగా వండర్‌బాయ్... ఇది మెయిన్ కెనాల్ సార్... నిజంగా ఇంత సాహసం చేయటం గ్రేట్" అన్నాడు. అంతే ! ఆ మాటతో ఒక్కసారిగా అందరూ రవికిరణ్‌ని అభినందించటం మొదలుపెట్టారు.

ఆదుర్దాగా నీళ్ళు కక్కిస్తున్న రఘునాధరెడ్డి గారి భార్య వసుంధరలో ఆ మాటల్తో ఒక్కసారిగా ఫ్లాష్ వెలిగింది. రవికిరణ్ ఏదో చెప్పబోతే... 'ష్'...అంది కోపంగా.

వినీతని గెస్ట్‌హౌస్‌కి తీసికెళ్ళారు.

★ ★ ★

మర్నాడు విలేకర్లందరికీ ఫోన్లు వెళ్ళాయి.

ఇంజనీరుగారు చిన్న పార్టీ అరేంజ్ చేశారు. రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలైన 'వసుంధర' అదంతా ఏర్పాటు చేసింది. విలేకర్ల ప్రశ్నలకు ఏం చెప్పాలో రవికిరణ్‌కి బాగా చెప్పింది. రవికిరణ్ సాహసం గురించి తోటి ఉద్యోగస్తులందరూ చెప్పాలని హుకుం జారీ చేసింది.

ఆఫీసర్‌గారి మెప్పు పొందడానికి వాళ్లు అందమైన కథలల్లి పెట్టారు.

విలేకర్ల సమావేశం జరిగింది. ఆఫీసరుగారు మౌనంగానే ఉన్నా సగం కెక్కువ

సమాధానాలు వసుంధరే చెప్పింది. వినీత కెవరు రక్షించారో స్పృహలేదు. తల్లికి భయపడి రవికిరణ్ జర్నలిస్టులకు ప్రిపేరయిన సమాధానాలు చెప్పాడు.

రవికిరణ్, వినీతల మీద కెమెరాలు క్లిక్‌మన్నాయి.

అనంతరం పాత్రికేయులకు విందు జరిగింది.

★ ★ ★

"చిన్నారి చెల్లిని రక్షించిన అన్న"

"ఇది సాహస బాలుని కథ"

"సాహస బాలుడు... రవికిరణ్"

(ఇంగ్లీష్‌లో) "ప్రాణాలకు తెగించిన సాహసబాలుడు రవికిరణ్"

'రవికిరణ్ అడ్వెంచర్'

అన్ని పత్రికలు ఘోషించాయి. ఏ పత్రికలో చూసినా మెయిన్ ఎడిషన్లో కవరైన వార్త.

వసుంధర అన్ని పత్రికల్లోని వార్తల్ని కట్ చేస్తుంటే... మన బిడ్డ మనకు దక్కింది. చాలదా... ఎందుకీ హంగామా అంతా ! అడిగాడు భర్త రఘునాథరెడ్డి.

వంటింట్లో బొద్దింకను చూసి జడుసుకునే కొడుక్కి అంత ధైర్యం ఎలా వచ్చిందా అని ఎంతకీ అర్థం కావటం లేదు ఆయనకి.

"మా తమ్ముడు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ తెలీదా... వాడికి ఈ కటింగ్స్ పంపిస్తాను అంతా వాడే చూసుకుంటాడు" అంది గర్వంగా స్లీవ్‌లెస్ జబ్బల్ని ఎగిరేస్తూ.

"ఏం చూసుకుంటాడు...." ఆశ్చర్యంగా అడిగాడు రఘునాథరెడ్డి.

"ఛీ మొద్దు మెదడు ఇంకా అర్థం కాలేదా ప్రధాన మంత్రి... అ...వా...ర్డ్" అంది చివరి పదాన్ని వత్తిపలుకుతూ.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు రఘునాథరెడ్డి. వినీత, రవికిరణ్ మొఖాలు చూసుకున్నారు.

'బాబుగారు నా పిల్లనగ్రోవి అందకుండా కొట్టుకుపోయింది' ఆ మాటతో అందరూ తలత్రిప్పి చూశారు.

తలుపుదగ్గర దీనంగా రంగడు.

అందరికన్నా ముందు తేరుకున్నది వసుంధర. చప్పున బ్యాగులోంచి యాభైనోటు తెచ్చి వాడిచేతిలో పెట్టి "వెళ్ళు... మళ్లీ రాకు" అంది.

వాడు దాన్ని నమ్మలేనట్టుగా చూసి, వినీతను కళ్ళతోనే పలకరించి సంతోషంతో తుర్రుమని పరిగెత్తాడు.

"అన్నీ సర్దుకోండి నాన్నగారి ఇన్స్పెక్షన్ అయిపోయింది మనం సాయంత్రం హైద్రాబాద్ వెళ్తున్నాం" అంది వసుంధర.

★ ★ ★

రవికిరణ్ ఢిల్లీలో 15వ ఆగస్టు రోజున ప్రధానమంత్రి చేత అవార్డు తీసుకున్నాడు. దేశం మొత్తం మీద సాహసబాలల అవార్డు అందుకున్న బాలబాలికల్ని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో అలంకరించబడిన ఏనుగు అంబారీ మీద ఎక్కించి ఊరేగించారు. లక్షలాది జనం ప్రముఖ స్వదేశ నాయకులు...విదేశీ నాయకులు, వేలాది పోలీసులు... విచిత్రమైన శకటాలు... రంగు రంగుల తోరణాలు.

ఏనుగెక్కిన రవికిరణ్‌కి దాన్ని చూడగానే చప్పున రంగడి దున్నపోతు గుర్తొచ్చింది.

ఒళ్ళంతా జలదరించింది మనసంతా అన్యమనస్కంగా ఉంది.

బ్రేవరీ అవార్డు అందుకున్న మాటేగాని క్షణక్షణానికి రంగడు గుర్తుకొచ్చాడు.

మనసంతా వెలితిగా అసంతృప్తిగా ఉంది.

ఏనుగు మీద ఊరేగుతుంటే ఇంకొందరు తనలాగే... ఒకరి భాష ఒకరికి రాదు.. ఎవరేం సాహసం చేశారో తెలీదు. ప్రక్కనున్న అబ్బాయిని మందలిస్తే మళయాళంలో ఏదో అన్నాడు. అటు ప్రక్కగా కూర్చున్న అమ్మాయి కన్నడంలో ఏదో అడిగింది.

ఒకరు హిందీలో మరొకరు మరాఠీలో... కొంతమంది ముఖాలు మాత్రం వెలిగి పోతున్నాయి.

ఏనుగెక్కి ఊరేగుతుంటే రంగడి దున్నపోతెక్కినట్టుగా ఉంది.

గ్యాలరీలోంచి అమ్మా, నాన్న, చెల్లి చేయి వూపుతున్నారు. అయిష్టంగానే తానూ చేయూపాడు. మరో చేతిలో అవార్డు అందంగా చూడముచ్చటగా వుంది. ప్రధాని భుజంతట్టి అందించిన ముచ్చటైన బ్రేవరీ అవార్డ్.

అమ్మ వెళ్ళి దూరదర్శన్ వాళ్ళతో ఏదో మాట్లాడుతోంది.

★ ★ ★

'ఠప్'

ఆ శబ్దానికి ఉలిక్కిపడి తిరిగి చూసాడు రవికిరణ్. నవ్వుతూ తాతయ్య "ఎప్పుడొచ్చావ్ తాతయ్యా చాలా రోజులకొచ్చావ్ ?" అడిగాడు తడబడుతూ "ఇప్పుడే నీ గురించి పేపర్లో చదివి వచ్చా... ఇదేనట్రా అవార్డు చాలా బావుంది. అవునూ నువ్వింత పిరికివాడివి అంత సాహసం ఎలా చేశావ్‌రా ?" తాతయ్య ప్రశ్నకి రవికిరణ్ ముఖం చప్పున చిన్నబోయింది. మాట్లాడలేకపోయాడు. "అదేంట్రా... మౌనంగా వుండిపోయావ్? ఇంతటి అవార్డ్ పొందినందుకు ఎంత ఆనందంతో వుండాలో తెల్సా ?" అంటూ చాక్లెట్ల పాకెట్ తీసిచ్చాడు.

రవికిరణ్ భయంభయంగా వరండాలోకి చూసాడు. తల్లి ఎవరో కళాసంస్థ వారితో రవికిరణ్ సన్మానం గురించి మాట్లాడుతోంది.

"తాతయ్యా...." అన్నాడు దీనంగా

"ఏమిట్రా.... ?"

"మరేమో నిజానికి చెల్లెల్ని కెనాల్‌లో రంగడు అనే పశువుల కాపరి కాపాడాడు. అమ్మే ఈ తతంగమంతా చేసింది". అన్నాడు అవమానంగా ఫీలవుతూ.

తాతయ్య షాక్ తిన్నాడు. ఆ తర్వాత బాధగా చెప్పాడు.

నాకు తెల్సురా. నేనూహించాను కూడా. ఇందులో మీ అమ్మేదో కిటుకు చేసుంటుం దని ! దాని తెలివితేటలు అలాంటివి, అవకాశాన్ని బట్టి లాభం చేసుకోవటం దానిలో ఉన్న గుణంరా. మీ అమ్మమ్మ కరీంనగర్ బస్టాండులో ఆర్టీసీ బస్సు ఢీ కొని చచ్చిపోతే ప్రక్కనే ఉంది మా అమ్మ.

ఆ తర్వాత ప్రధాన సాక్షిగా కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పడానికి ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయల్లో నలభైవేలు ఖచ్చితంగా ఇస్తేనే వస్తానంది. ఈ కన్నతండ్రితో...అదీ మా అమ్మంటే... నలభై వేలు మీ అమ్మకిచ్చినందుకు అలిగి అన్నం కూడా సరిగా పెట్టట్లేదు నా కొడుకులు..."

తాతయ్య పంచెతో కళ్లద్దుకుంటుంటే... హడావిడిగా వచ్చాడు రఘునాధరెడ్డి.

"నమస్కారం మామగారు... ఎప్పుడొచ్చారు ? రవీ... మనం రేపు మళ్ళీ ధరూర్ క్యాంపు కెళ్తున్నాం. అక్కడ ఉద్యోగస్తులంతా నీ అవార్డ్‌ని, నిన్ను చూడాలనుకుంటున్నట్లు ఫోన్ చేశారు. రెడీ అవు..." అని చెప్పేసి వెళ్ళిపోయాడు.

రవికి చప్పున రంగడు గుర్తొచ్చాడు వాడికీ అవార్డ్ చూపిస్తే... ఈ ఆలోచన రాగానే

"ఒకే డాడీ..." అన్నాడు సంతోషంగా...

★ ★ ★

క్యాంప్ గెస్ట్‌హౌస్‌లో దిగినప్పటి నుంచి రవికి కాలువ వైపు వెళ్లాలనే ఆతృత మొదలయింది.

ఎవరెవరో వచ్చి బోకేలందిస్తున్నారు. గిఫ్ట్‌లు కూడా బాగానే వచ్చాయి. మధ్యాహ్నం మూడయ్యింది. ఆ సాయంత్రమే తిరిగి వెళ్లిపోవటం.

రవికిరణ్ ఇక ఆపుకోలేక అవార్డ్ తీసుకొని "డాడీ...క్షణంలో వచ్చేస్తా"నని చెప్పి కాలువ వైపు పరుగుతీసాడు.

దూరంగా పశువుల మంద... !

కాలువ గట్టు మీద దున్నపోతు మీద రంగడు !!

రవికిరణ్ ముఖం వెలిగిపోయింది. వేగంగా పరిగెత్తాడు.

పరిగెత్తుతూనే రంగా... అని పిలిచాడు.

వాడు దున్నపోతు మీంచి వెనుదిరిగి చూశాడు. అవార్డ్‌నోసారి గాల్లో వూపి మరింత వేగంగా పరిగెత్తుకొచ్చాడు.

ఆయాసంతో రొప్పుతూనే ఆగడానికి నిలదొక్కుకుంటూ దున్నపోతు మీంచి దిగిన కుర్రాణ్ణి చూసి ఆశ్చర్యపోయాడు.

వాడు రంగడు కాదు...!

"రంగడు... రంగ...డే...డి... ?" గుండె గొంతుకడ్డం పడుతుండగా అడిగాడు. వాడు దీనంగా కాలువ దిక్కు చూపించాడు. రవికిరణ్ అయోమయంగా వాడివైపు చూస్తుంటే "నా పేరు రంగడు కాదు... రాజడు" అన్నాడు.

"మరి రంగడేడి ?" గుండెను చిక్కబట్టుకుంటూ తడబడుతూ అడిగాడు.

"రంగడు..మొన్న మందలోని రెడ్డిగారి లేగదూడ కాలువలో కొట్టుకుపోతుంటే దాన్ని కాపాడటానికి కాలువలో దూకాడు లేగదూడని ఒడ్డున జేర్చాక లాగు జేబులో ఏభై రూపాయల నోటు నీళ్ళలో పోయిందని వెతకడానికెళ్ళి అటే కొట్టుకుపోయాడు.

మూడు రోజులకి... చిల్వకోడూరు చెరువులో వాడి శవం దొరికితే... " వాడు చెప్పుకుంటూ పోతున్నాడు.

రవికిరణ్ కేమీ వినిపించట్లేదు...

కాలువ వైపు చూస్తుండిపోయాడు... నిశ్శబ్దంగా సాగిపోతోంది కాలువ కళ్ళలోని నీటి పొరలు కరిగి చెక్కిలి మీదధారలు కడుతున్నాయి. అవార్డునలాగే గుండెలకు హత్తుకుని వెనుదిరిగాడు. చీకట్లు కమ్ముకున్నట్లు గెస్ట్‌హౌస్ వైపు భారంగా అడుగులేసాడు.

కళ్ళు ధారాపాతమయ్యాయి.

"రవీ..." గెస్ట్‌హౌస్ చేరగానే తండ్రి పిలిచాడు. కలలోలా రవి నిల్చుండిపోయాడు... క్షణాలు... నిమిషాలు... ఏదో గుర్తొచ్చినట్టు గబుక్కున వెనుదిరిగి కాలువవైపు పరిగెత్తాడు.

"రం...గా...." రవి పిలుపుకు కాలువ కూడా ఉలిక్కిపడిందేమో... అలలు ఉవ్వెత్తున లేచాయి. రంగా అని పిలుస్తూనే కాలువ దగ్గరికి చేరాడు.

వగరుస్తూ గట్టుమీద నిలిచిపోయి...

చేతిలోని అవార్డ్‌ను బలంగా కాలువలోకి విసిరేసాడు... క్షణంపాటు నీటిలో 'దబ్' మన్న శబ్దం... అలలు వలయాలై చెల్లాచెదురయ్యాయి. చిన్నిగుండెలో కొండంత బరువు దిగినట్లు వెనుదిరిగి గెస్ట్‌హౌస్ వైపు సాగిపోయాడు.

(అక్షరాల్ని మెరిపించే కొత్త రచయితల్ని
పెన్ను తట్టిలేపి అక్షరాల్లో మెరవటం నేర్పే...
నిజాం వెంకటేశం గారి పెద్ద మనసుకి...
ప్రేమతో ఈ కథ...)